క్లుప్తంగా

కుట్టు మిషన్ అందజేత



జనగామ రూరల్: తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని పేద, నిరుద్యోగ, అర్హత, శిక్షణ పొందిన క్రిస్టియన్ మహిళలకు ఇందిర మహిళా శక్తి పథకం కింద నియోజక వర్గానికి-5 ఉచిత కుట్టు మిషన్ యంత్రాలు మంజూరయ్యాయి. కాగా, బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బి.విక్రం కుమార్ పాల్గొన్నారు

'ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలు'



మాట్లాడుతున్న తఫ్జిల్

నర్మెట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన నియమించిన ఉపాధ్యాయ నియామకాల్లో అవకతవకలు జరిగినాయని ఆర్టీఐ యాక్టివిస్ట్ ఎండి.తఫ్జిల్, పూర్వ హవల్దీ బెస్ట్ టీచర్ అయిలపాక సాగర్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పకుమారి ప్రకటనలు ఇచ్చినప్పటికీ నియమకాల్లో పారదర్శకత లేదన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్, డీఈఓ, అదనపు డైరెక్టర్లతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆటోమోటివ్ టు వీలర్ బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత వసతితో కూడిన శిక్షణను అందించనున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పాకాల సంతోష్ తెలిపారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత బైక్ మెకానిక్ కోర్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. పూర్తి వివరాల కోసం 7093411084 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు బైరపాక వినోద్, దీప్తి తదితరులు పాల్గొన్నారు. 16ఎస్టీజీ053 కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ బాధ్యులు

టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: పీఎస్ హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా శాఖ టేబుల్ క్యాలెండర్‌ను పట్టణంలో బుధవారం డీఈఓ భోజన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రేణుకుంట్ల మురళి, వేల్పుల చందయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేయూత



తరిగొప్పుల: స్నేహితురాలికి కుటుబానికి అండగా నిలబడ్డారు తనతో కలిసి చదివిన సహచర స్నేహితులు. మండలకేంద్రానికి చెందిన కొయ్యడ సుశీల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా, మృతురాలు కుమార్తె భవానితో కలిసి చదువుకున్న 2009–10 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.21,400 నగదును మృతురాలి భర్త కొయ్యడ రవికి బుధవారం అందజేశారు. ఎదునూరి కర్ణాకర్, బురగోని హేమలత, వాసవి, సురేష్, జంగ రవి, అనిల్, అంకం రాజు, కనకరాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన బండెల రమేశ్ అనారోగ్యానికి గురయ్యాడు. కాగా, సామాజిక సేవా కార్యకర్త కొడూరి శివకుమార్ రమేశ్‌ను పరామర్శించి రూ.5వేల సాయం అందజేసి ధైర్యం చెప్పారు. వంచ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కనుకరాజు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ గోపాల్‌నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఘనపురం నాగేష్ అన్నారు. బుధవారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. పస్తం పోశయ్య, వద్ది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యల తిష్ట



జఫర్‌గఢ్ జూనియర్ కళాశాల



అధ్వానంగా మారిన కళాశాలకు వెళ్లే దారి



తరగతి గదిలో కుంగిన టైల్స్

- దెబ్బతిన్న గదుల తలుపులు, కిటికీలు
- అరకొర వసతులతో విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం, సంబంధిత అధికారులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి. ఏళ్ల తరబడి అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ఇబ్బందుల నడుమ కళాశాల తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ప్రారంభంలో సొంత భవనం లేక గత కొన్నేళ్ల పాటు స్థానిక ఉన్నత పాఠశాలలోనే కళాశాల తరగతులను నిర్వహించారు. అనంతరం కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం కళాశాలలో 165 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని తరగతులకు సంబంధించిన అధ్యాపకులు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే రోడ్డుకు కళాశాల భవనం ఎత్తులో నిర్మించకపోవడంతో వర్షపు నీరు కాలేజీ ఎదుట నిలిచి పూర్తిగా బురదమయంగా మారుతోంది. దీంతో కళాశాలలోకి వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కళాశాల తరగతి గదుల్లో, వరండాలో టైల్స్ కుంగిపోవడంతోపాటు తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు గదుల్లో లైటింగ్, ఫ్యాన్లు లేకపోవడం, క్లాసుల్లోకి కోతులు రావడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించి విద్యార్థుల ఇబ్బందులను తొలిగించాలని వారు కోరుతున్నారు.

వర్షం పడితే బురదమయం



కొద్ది పాటి వర్షానికే కళాశాలకు వెళ్లే రహదారి, ప్రాంగణం పూర్తిగా బురమయంగా మారుతుంది. కళాశాల చుట్టూ ఇప్పటి వరకు ప్రహరీ నిర్మించలేదు. తరగతి గదుల తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైన కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

- రాజ్‌కుమార్, విద్యార్థి

మౌలిక వసతులు కల్పించాలి



కళాశాలలో నెలకొన్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. భవనం నిర్మించి ఎన్నో ఏళ్లు అవుతున్నా కళాశాలకు దారి సక్రమంగా లేదు. తరగతి గదుల్లో టైల్స్ కుంగిపోయాయి. తలు పు లు, కిటికిలు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

- అంజి, విద్యార్థి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..

కళాశాలలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానున్నట్లు అధికారులు తెలి పారు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- ప్రమోద్‌కుమార్, ప్రిన్సిపాల్

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

- కల్లెం–జీడికల్ రహదారి పనులకు నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన



గుంతలమయమైన జీడికల్-కల్లెం రోడ్డు

లింగాలఘణపురం: మండలంలోని కల్లెం– జీడికల్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా ధ్వంసమైన రోడ్డుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.8 కోట్లతో 14 కిలో మీటర్ల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు తీసుకుని టెండర్లు పూర్తి ఈ నెల 17న పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీంతో జనగామ నుంచి వయా కల్లెం మీదుగా జీడికల్ వీరాచల రామచంద్రస్వామిని దర్శించుకొనే భక్తులకు, అదేవిధంగా మోత్కూరు వెళ్లే ప్రజలకు కూడ కష్టాలు తీరనున్నాయి. అదేవిధంగా నిత్యం జనగామకు వెళ్లే జీడికల్, సిరిపురం, కల్లెం గ్రామాల ప్రజలు గుంతలమయమైన రోడ్డుతో నానా తంటాలు పడేవారు. అంతే కాకుండా ఆటో డ్రైవర్లు నిత్యం గుంతల రోడ్డులో ప్రయాణించి ఆటోలు తరుచుగా మరమత్తుకు గురయ్యేవి. దీంతో సొంత ఖర్చులతో అనేకసార్లు ఆటో డ్రైవర్లు గుంతలను పూడ్చుకున్న సంఘటనలు ఉన్నాయి. రోడ్డు మరమత్తు చేయాలని అనేకసార్లు ఆందోళనలు కూడా చేశారు. ఎమ్మెల్యే కడియం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక కృషి చేసి రోడ్డుకు నిధులు మంజూరీ చేయించి నేడు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



చిల్పూరు: దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేట: మాట్లాడుతున్న కొమురయ్య

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

చిల్పూరు: గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన భూ సమస్యల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరస్వతితో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ కల్వల శ్రీనివాస్, డీటీ చెల్కపల్లి సదానందం, ఆర్ఐ తూలూరి లోకేష్, ఏఆర్ఐ భిక్కి అర్జున్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ తహసీల్ సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక తహసీల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రిజిస్టర్లు, ఫైళ్లను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌తో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఏ విధంగా చేస్తున్నారని తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్ ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి

బచ్చన్నపేట: భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్పెషల్ అదనపు కలెక్టర్ కొమురయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్‌లో భూ సమస్యల దరఖాస్తులను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోపు దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. తహసీల్దార్ రామానుజా చారి, డీటీ శంకర్, ఎంఆర్ఐలు వంశీకృష్ణ, మున్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



కూనూర్‌లో బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని కూనూర్ గ్రామం నుంచి వెంకటాపూర్ వరకు రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు, తిడుగు గ్రామంలో రూ.35 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అలాగే స్థానిక పాఠశాల అవరణలో నూనతంగా ఏర్పాటు చేసిన జీమ్‌ను ప్రారంభించి గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావ ణ్యశిరిష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్‌తో పాటు మార్కెట్ డైరక్టర్లు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా హోమం

చిల్పూరు: నష్కల్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా బుధవారం ఘనంగా వేద మంత్రాల నడుమ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గంటె ఉపేందర్‌యాదవ్, కర్ణకంటి స్వప్నవెంకటేష్, పాశం సురేష్, కూరపాటి సాంబయ్య, మోడెం స్వామి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి'



మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: మార్పు పేరుతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెబితే పల్లెలకు పూర్వవైభవం వస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కామారెడ్డి గూడెం, మన్‌పహాడ్, గొల్లపల్లి గ్రామాల క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ఇన్‌చార్జ్ దరావత్ గాంధీ నాయక్, ప్రధాన కార్యదర్శి చింతరవి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న సీసీ తిరుమల

బచ్చన్నపేట: ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతను తప్పకుండా నిర్మించుకోవాలని ఐకేపీ సీసీ తిరుమల అన్నారు. బుధవారం నారాయణపురం, పోచన్నపేట గ్రామాల్లో ఆమె పర్యటించి ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఇంకుడుల నిర్మాణంతో కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించాలని తెలిపారు. ఆమె వెంట మహిళలు, గ్రామస్తులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జనగామ రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో కాంగ్రెస్ అధ్యక్షుడు మిద్దెపాక స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించిన వార్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పేదలకు చేసింది ఏమీ లేదన్నారు. ఏడాదిన్నరలో సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారని చెప్పారు. గాదేపాక రావ రామ్‌చదర్, మంతపూరి ప్రకాష్, ఉడుగుల నర్సింగరావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి చేయూతనివ్వాలి

కొడకండ్ల: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు చేయూతనిచ్చి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. బుధవారం నర్సింగాపురం గ్రామంలో రంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రామచంద్రయ్య,ప్రసాద్‌రెడ్డి, వెంగల్ రావు, ఉప్పలయ్య, సోమనర్సయ్య, భిక్షపతి, యాకేష్, మదుసూధన్, యాకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట



కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు, మహిళలు



బచ్చన్నపేట: శివలింగానికి పూజ చేస్తున్న భక్తులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట: వరుణుడు కరుణించి వర్షాలు బాగా కురిపించాలని గబ్బెటలో బుధవారం చిన్నారులు కప్పతల్లి ఆట ఆడారు. చిన్నారులు రోకలికి కప్పను కట్టి వేపాకులతో అలంకరించి వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ కప్పతల్లి ఆడారు. కప్పతల్లితో వచ్చిన చిన్నారులకు మహిళలు నీళ్లు పోసి వర్షాలు కురువాలని మొక్కుకున్నారు. వరుణ దేవుడా కరుణించంటూ కాముడూ ఆడుతూ వేడుకున్నారు. అలాగే బచ్చన్నపేటలో గ్రామస్తులు వానలు కురవాలని ఆలయాల్లో పూజలు చేశారు.

పింఛన్లు పెంచి ఆదుకోవాలి



మాట్లాడుతున్న సోమరాజు

దేవరుప్పుల: అర్హులైన దివ్యాంగ, వితంతు, వృద్ధులకు పింఛన్లు పెంచి ఆదుకోవాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం సోమరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి నాయక్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో సోమరాజు పాల్గొని మాట్లాడారు. కొంగరి రాములు, మేడ సుధాకర్, దండు రామచంద్రయ్య, మేకల ఐలయ్య, రమణారెడ్డి, వెంకట్, సోమయ్య, రాములు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ట్రిపుల్ ఐటీకి మరో ఇద్దరు విద్యార్థుల ఎంపిక

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు బింగి సాయివరుణ్, ఉప్పల శివ మహబూబునగర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మొదటి విడత కౌన్సింగ్‌లో బాసరలో ముగ్గురికి, రెండో విడత కౌన్సింగ్‌లో మహబూబునగర్ ట్రిపుల్ ఐటీలో ఇద్దరు విద్యార్థులకు సీటు లభించడంతో వారిని అభినందించారు.

సూరారం సర్పంచ్ రిజర్వేషన్ దళితులకు కేటాయించాలి

జఫర్‌గఢ్: మండలంలోని సూరారం గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ దళితులకు కేటాయించేలా చూడాలని గ్రామ మాజీ వార్డు సభ్యుడు కాసర్ల రాజు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆపరేషన్ కోసం హైదరాబాద్ తరలింపు

చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామంలో సోమవారం రంగు హరీష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. కాగా, 30 మందికి ఆపరేషన్‌లు అవసరం కావడంతో వారిని బుధవారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో ఉడుత వెంకన్న, దిండిగల రాజయ్య, కొంరయ్య, పిట్టల రాజు పాల్గొన్నారు.

నియామకం

జఫర్‌గఢ్: కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా కుక్కల సారంగం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ జఫర్‌గఢ్‌కు చెందిన సారంగం కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పని చేస్తున్నందున అందరి ఏకాభిప్రాయం మేరకు పార్టీ గ్రామ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. సారంగం మాట్లాడుతూ తన నియమానికి కృషి చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని కుందారంలో బుధవారం చిర్ర రవి ట్రాక్టర్‌లో మొరం కొడుతూ ఎత్తైన గడ్డను ఎక్కించే క్రమంలో బోల్తాపడి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా పైలెట్ తేజావత్ నరేశ్‌కుమార్, డీఎంటీ బిల్లా రవి వెంటనే వారిని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

గులాబీ జెండా ఎగురవేయాలి

బచ్చన్నపేట: త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని క్లస్టర్ గ్రామాల ఇన్‌చార్జ్‌లు మేకల రాంప్రసాద్, మహమ్మద్ గులాంబాయ్ యాకూబ్‌పాషా పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లి, గోపాల్‌నగర్, చిన్నరామన్‌చర్ల గ్రామాల ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, కొమ్ము రాజు, రమణారెడ్డి, చెంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పాలకుర్తి టౌన్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రూ.70 వేల విలువైన ఆవు మృతి చెందిన సంఘటన పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురంలో బుధవారం జరిగింది. బాధిత రైతు లగ్గాల కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ బావి వద్ద రోజు మాదిరిగా సాయంత్రం ఆవు మేత మేస్తూ వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన నాయకులు

దేవరుప్పుల: నూతనంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ, దివ్యాంగుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను బుధవారం హైదరాబాద్‌లో పలువురు నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈరెంటి విజయ్ మాదిగ, ప్రొఫెసర్ ఇక్కుర్తి మనోహర్, గద్దం యాదగిరి ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్‌క్లబ్‌ల సహకారంతో హనుమకొండకు చెందిన శరత్ మాక్స్ విజన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గురువారం స్థానిక మోడల్‌కాలనీలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు శివునిపల్లి లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి కంటిలో దుర్మాంసం పెరిగిన వారికి హనుమకొండలోని శరత్ నేత్ర వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే శిబిరంలో నేత్ర పరీక్షలు చేపట్టి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు



ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, లబ్ధిరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ములుగు రూరల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచించారు. బుధవారం మల్లంపల్లి మండలంలోని భూపాల్‌నగర్‌లో శివాలయంతో పాటు పాఠశాలను జనగామ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరెడ్డితో కలిసి సందర్శించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. తన అత్త, మామ హనుమాండ్ల లక్ష్మమ్మ-పాపిరెడ్డి పేరిట నిర్మించిన పాఠశాల భవనం, శివాలయం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సిరెడ్డిలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ నాగిడి రమణారెడ్డి, అనంతరెడ్డి, రాజేందర్‌రెడ్డి, లోక్‌నాథం, లక్ష్మణ్, భాస్కర్, సాంబయ్య, సుదర్శన్, భీమా పాల్గొన్నారు.